క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

యాచారం: ఎంపీపీ కొప్పు సుకన్య అధ్యక్షతన శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ జంగమ్మ, వైస్ ఎంపీపీ శ్రీనువాస్‌రెడ్డి హాజరవుతారని.. అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు సకాలంలో హాజరుకావాలని కోరారు. కాగా ఎంపీటీసీ సభ్యులకు శుక్రవారం జరగబోయే సమావేశం చివరిది. జూలై 4న ఎంపీటీసీ, జెడ్పీటీసీల పదవీకాలం ముగుయనుంది.

నేడు కంటి వైద్య శిబిరం

అబ్దుల్లాపూర్‌మెట్: సురక్షా సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గోపిశంకర్ యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కంటి ఆపరేషన్లు చేయించుకోవాలనుకే వారు 73308 92709 నంబర్‌కు ఆధార్ కార్డు ఫొటోను వాట్సప్ ద్వారా పంపించాలని ఆయన కోరారు.

రైతుబంధు నిధులు విడుదల చేయండి

ఎంపీపీ సుకన్య

యాచారం: వర్షాలు కురుస్తున్న దృష్ట్యా వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయని వెంటనే రైతుబంధు నిధులను జమ చేయాలని ఎంపీపీ కొప్పు సుకన్య ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో గురువారం ఆమె మాట్లాడుతూ... రైతులు వ్యవసాయ పనుల్లో పెట్టుబడుల కోసం అప్పులు చేస్తున్నారని.. సర్కార్ వెంటనే రైతుల ఖాతాల్లో రైతుబంధు నిధులు జమ చేయాలని కోరారు. అదే విధంగా పత్తి విత్తనాలపై వ్యవసాయ శాఖ నిఘా పెట్టాలని, అవసరమైతే వ్యవసాయ శాఖానే విత్తనాలు సరఫరా చేయాలని కోరారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

మండల వ్యవసాయ అధికారి శ్రీలత

కడ్తాల్: నకిలీ విత్తనాలు విక్రయించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి శ్రీలత హెచ్చరించారు. మండల పరిధిలోని ముద్విన్‌లోని పలు ఎరువుల, విత్తన దుకాణాలను గురువారం ఆమె తనిఖీ చేశారు. షాపులలో యూరియా, కాంప్లెక్స్ ఎరువుల నిల్వ, అమ్మకాలు, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఏఈఓ అభినవ్ తదితరులు ఉన్నారు.

పంచాయతీలకు నిధులివ్వండి: ఎంపీపీ



మాట్లాడుతున్న ఎంపీపీ పద్మారెడ్డి

మాడ్గుల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలకు నిధులు సకాలంలో అందించకపోవడంతో అభివృద్ధి పనులు ముందుకెళ్లడం లేదని ఎంపీపీ గౌరవరం పద్మారెడ్డి అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. గ్రామాలకు నిధులు మంజూరు చేయక దాదాపు రెండు సంవత్సరాలు అవుతోందని సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రత్యేకాధికారులు, కార్యదర్శులకు బాధ్యతలు అప్పజెప్పారని చెప్పారు. అయితే పంచాయతీ సిబ్బందికి దాదాపు 6నెలలుగా జీతాలు అందలేదని ఎంపీపీ తెలిపారు. వెంటనే జీపీలకు నిధులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు పాండుగౌడ్, నారమ్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

వాహనాల వేలంతో రూ.89వేల ఆదాయం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు గురువారం వేలం నిర్వహించారు. స్టేషన్ ఆవరణలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఉజ్వల రెడ్డి, సీఐ బద్యానాథ్ చౌహాన్ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. వాహనాలకు రూ.37,000 ప్రభుత్వ ధరగా నిర్ణయించగా ఆసక్తి ఉన్నవారు రూ.89,444 వరకు పాటపాడి కొనుగోలు చేశారు. ఎక్సైజ్ ఎస్ఐలు కృష్ణప్రసాద్, అరుణ్‌కుమార్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

పోచమ్మ ఆలయంలో అన్నదానం

షాబాద్‌షరీఫ్: అమావాస్యను పురస్కరించుకొని షాబాద్‌షరీఫ్‌లోని పోచమ్మ దేవాలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కెఎస్. ప్రశాంత్, సూర్య గౌడ్, శంకర్ యాదవ్, ఈదులకంటి విశాల్ గౌడ్, చింటూ, నవీన్ చారి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి కమిషనర్‌తోనే సరి

- తుర్కయంజాల్ కమిషనర్‌పై ఇటీవల సస్పెన్షన్ వేటు
- మీర్‌పేట కమిషనర్ చంద్రశేఖర్‌కు అదనపు బాధ్యతలు
- పని ఒత్తిడితో ఇక్కడ సమయం కేటాయించలేకపోతున్న వైనం
- సకాలంలో పనులు కాక ఇబ్బంది పడుతున్న ప్రజలు



తుర్కయంజాల్ మున్సిపల్ కార్యాలయం

తుర్కయంజాల్: పురపాలక సంఘానికి పూర్తిస్థాయి కమిషనర్ లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇక్కడ ఇదివరకు కమిషనర్‌గా పనిచేస్తున్న బి.సత్యనారయణ రెడ్డి మే21న సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. దీంతో మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చంద్రశేఖర్‌కు ఇక్కడి అదనపు బాధ్యతలను సీడీఎంఏ కేటాయించింది. దీంతో ఆయన రెండు చోట్లా పనిచేయాల్సి రావడంతో తుర్కయంజాల్‌కు ఎక్కువ సమయం కేటాయించలేకపోతున్నారు. దీంతో పనుల నిమిత్తం మున్సిపల్ కార్యాలయానికి వచ్చేవారికి ఇబ్బందులు తప్పడం లేదు. రోజుల తరబడి తిరుగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు.

అనుమతుల జారీలో జాప్యం

భవన నిర్మాణ అనుమతులు, అసెస్‌మెంట్, మ్యూటేషన్, బర్త్, డెత్ సర్టిఫికెట్ల జారీ వంటి వాటికి రోజుల తరబడి ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది. నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులోగా వాటిని జారీ చేయాల్సి ఉన్నప్పటికీ పెండింగ్‌లోనే ఉంటున్నాయి. ఇన్‌చార్జి కమిషనర్ కార్యాలయానికి సమయం కేటాయించకపోవడం, పని ఒత్తిడితో ఎక్కడిక్కడ ఫైల్‌లు పేరుకుపోయాయి. కార్యాలయ సిబ్బంది ఫైల్స్ పట్టుకుని మీర్‌పేటకు రోజూ తిరగాల్సి వస్తోంది.

శానిటేషన్ అస్తవ్యస్తం..

మున్సిపాలిటీకి పూర్తిస్థాయి కమిషనర్ లేకపోవడంతో శానిటేషన్ అస్తవ్యస్తంగా మారింది. పలు కాలనీల్లో రోడ్ల పక్కన చెత్తను ఇష్టానుసారంగా వేస్తుండటంతో డంపింగ్ యార్డ్‌లుగా మారుతున్నాయి. సిబ్బందిపై పర్యవేక్షణ కరువైంది. ఇటీవల తుర్కయంజాల్‌లోని శ్రీరామ్ నగర్ కాలనీలో ఓ వ్యక్తిపై కుక్క దాడి చేయడంతో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారు కరువయ్యారు. అదే కుక్క 10రోజుల తర్వాత గాయపడిన వ్యక్తి తల్లిని కూడా కరిచి గాయపరించింది. అయినప్పటికీ అధికారుల స్పందన కరువైంది.

కోడ్ ముగియడంతో..

లోక్‌సభ ఎన్నికల కోడ్ ఈనెల 6వ తేదీతో ముగియడంతో సీడీఎంఏ అధికారులు పూర్తిస్థాయి కమిషనర్‌ను కేటాయించడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. గతంలో ఇక్కడ కమిషనర్‌గా పని చేసిన పలువురు మరోసారి ఇక్కడికి రావడానికి ఇప్పటికే ప్రయత్నాలు మొదులు పెట్టినట్లు తెలుస్తుంది. వెంటనే అధికారులు స్పందించి పూర్తిస్థాయి కమిషనర్‌ను నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

యువత రక్తదానం చేయాలి

బీజేపీ సీనియర్ నేత ఆచారి



ఆమనగల్లు: రక్తదానం చేసిన యువకులను అభినందిస్తున్న ఆచారి

ఆమనగల్లు: యవతీ, యువకులకు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని బీజేపీ సీనియర్ నేత ఆచారి కోరారు. ఆయన జన్మదినం సందర్భంగా ఆమనగల్లు పట్టణంలోని గాంధీచౌక్ వద్ద బీజేవైఎం మరియు రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో 153 మంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన నాయకులు, యువకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు పట్టణ బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్‌సింగ్, కల్వకుర్తి బీజేవైఎం కన్వీనర్ అనిల్, కోకన్వీనర్ రాజశేఖర్, మీడియా ఇన్‌చార్జి రవిరాథోడ్, రాష్ట్ర బీజేపీ ఎస్సీ మోర్చా మాజీ అధ్యక్షుడు కొప్పు బాషా, రాష్ట్ర బీజేవైఎం అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు యాదీష్, ఉపాధ్యక్షుడు కండె సాయి, రాష్ట్ర అధికార ప్రతినిధి భగీరథ్, నాయకులు మహేశ్, మున్సిపల్ కౌన్సిలర్లు లక్ష్మణ్, శ్రీశైలంయాదవ్, చెన్నకేశవులు, విజయ్‌కృష్ణ, శేఖర్, నర్సింహ, సందీప్, శ్రీనివాస్, చందు, అశోక్, శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ఆమనగల్లు బస్టాండ్ వద్ద బీజేపీ నాయకులు ప్రజలకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు.

విరివిగా మొక్కలు నాటాలి

తలకొండపల్లి: ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచి గ్రామాలను పచ్చని వనాలుగా మార్చాలని బీజేపీ ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీజేపీ సీనియర్ నేత ఆచారి పుట్టిన రోజు వేడుకలను ఆ పార్టీ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ



పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ

మంచాల: ప్రభుత్వం అందించే వసతులు, సహాయన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మంచాల ఎంపీడీఓ బాలశంకర్ అన్నారు. గురువారం మంచాల మండల కేంద్రంలో వివిధ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, స్కూల్ యూనిఫాంలు అందిస్తోందన్నారు. ప్రదీ విద్యార్థి వాటిని సద్వినియోగం చేసుకొని కష్టపడి చదవాలన్నారు. చదువుకున్న బడికి మంచిపేరు తేవాలన్నారు ఈ కార్యక్రమంలో ఆరుట్ల మోడల్ స్కూల్ ప్రిన్స్‌పాల్ కల్యాణ్ చక్రవర్తి, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ కె.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై ఇసుక మేటల తొలగింపు



ప్రధాన రహదారిపై ఇసుక మేటలను తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

బడంగ్‌పేట్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు ప్రధాన రహదారుల్లో చాలా చోట్ల ఇసుక మేటలు పేరుకపోయి ప్రమాదాలకు నిలయంగా మారాయి. దీన్ని గుర్తించిన బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సిబ్బందితో శుభ్రంచేయిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నైరుతి రుతు పవనాలు తెలంగాణను తాకడంతో వాతావరణం చల్లబడిందన్నారు. అక్కడక్కడ వర్షాలు కురుస్తున్నాయన్నారు. నియోజకవర్గంలో కూడా వర్షాలు కురుస్తున్నాయన్నారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లపై చెత్తా, చెదారం చేరడమే కాకుండా ఇసుక పేరుకపోతుందన్నారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గ్రహించి సిబ్బందితో ఇసుకను ఎత్తిస్తున్నామన్నారు. వారం క్రితం ఎమ్మార్వో కార్యాలయం వద్ద, అలాగే పెద్దబావి మల్లారెడ్డి గార్డెన్ ఎదురుగా ప్రధాన రహదారిలో కొత్త మున్సిపల్ కార్పొరేషన్ మూల మలుపు వద్ద ఇసుక పేరుకపోయిందన్నారు. గుర్తించిన అధికారులు వెంటనే ఇసుకను ఎత్తివేయించారన్నారు. ఇటీవల ఈ ఇసుక మేటల వల్ల బైకులు అదుపుతప్పిన ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందడం బాధాకరమన్నారు. ఈ విషయాన్ని గమనించిన కార్పొరేషన్ అధికారులు ప్రధాన రహదారిలో ఎక్కడ కూడా పేరుకుపోయిన వెంటనే గుర్తించి పారిశుధ్యసిబ్బందితో ఇసుకను తొలగించే పనులు నిర్వహిస్తున్నారన్నారు. ప్రమాదాలను నివారించేందుకు సిబ్బంది చేస్తున్న సేవలను వాహనదారులు, ఆయా కాలనీలవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కుట్టుమిషన్ కేంద్రం పరిశీలన

మంచాల: మండల కేంద్రంలోని కుట్టు మిషన్ కేంద్రాన్ని మండల ప్రత్యేకాధికారి శాంతి శ్రీ గురువారం సందర్శించారు. మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో స్కూల్ యూనిఫాంలు కుటుతున్న విషయం తెలుసుకున్న ఆమె అక్కడికి వెళ్లి వారితో మాట్లాడారు. మహిళలు బాగా కష్టపడి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. అనంతరం ఆమె మంచాల, లింగంపల్లి గ్రామాల్లో నర్సరీలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ తేజ్ సింగ్, ఏపీఎం శోభ, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, శిరీష, అంగన్ వాడీ సూపర్‌వైజర్ కల్పన తదితరులు పాల్గొన్నారు.



యూనిఫాంలను పరిశీలిస్తున్న శాంతి శ్రీ

ఆమనగల్లులో భారీ వర్షం



జాతీయ రహదారిపై నిలిచిన వర్షపు నీరు



కాలనీవాసులతో మాట్లాడుతున్న కమిషనర్

ఆమనగల్లు: ఆమగనల్లు పట్టణంలో గురువారం మధ్యాహ్నం గంటపాటు ఏకధాటిగా భారీ వర్షం కురిసింది. పట్టణంలో ఉదయం ఎండగా ఉన్నప్పటికీ మధ్యాహ్ననికి ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. నల్లని మబ్బులు ఏర్పడి గంట పాటు వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని పలు కాలనీలు జలమయంగా మారాయి. అలాగే హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై ఏపీజీవీబీ బ్యాంకు వద్ద, హీరో షోరూం ముందు రోడ్డుపై భారీగా నీళ్లు నిలవడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. పట్టణంలోని పలు కాలనీల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను మున్సిపల్ కమిషనర్ వసంత పర్యవేక్షించారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

గురూజీ అనిల్‌కుమార్ జోషి



గురూజీ సందేశాన్ని ఆసక్తిగా వింటున్న భక్తులు

కందుకూరు: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి పేర్కొన్నారు. ప్రతి నిత్యం భగవంతుడి సాధనలో కొంత సమయం గడిపితే, ఆధునిక సమాజంలో ఆటుపోట్లను తట్టుకుని నిలబడే శక్తి లభిస్తుందని ఆయన సూచించారు. అమావాస్యతో పాటు శని జయంతిని పురస్కరించుకుని గురువారం మండలంలో పులిమామిడి పరిధిలోని శ్రీనిఖిల్ చేతనా కేంద్రంలో గురూజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమస్యలు, రోగాల 'నివారణ కోసం ప్రత్యేకంగా హోమం, పూర్ణాహుతి చేశారు. అనంతరం భక్తులకు గురూజీ ఆశీర్వాదాలతో పాటు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రవచనాలు, సందేశం ఇచ్చారు. సమస్యలు లేని జీవితం అనేది ఉండదని, ఆ సమస్యలను ఎదుర్కొని, పరిష్కరించుకునే మార్గం భగవంతుడి సాధనతోనే సాధ్యమవుతుందన్నారు. మానవ సేవయే మాధవ సేవగా భావించి తోటి వారితో స్నేహభావంతో మెలుగుతూ అందరితో కలిసి మెలిసి సంతోషంగా జీవించేలా తమను తాము తీర్చిదిద్దుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

యువత శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి

శివసేన యూత్ అసోసియేషన్ ప్రతినిధులు



శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

షాబాద్‌షరీఫ్: మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించిన గొప్ప ధీశాలి ఛత్రపతి శివాజీ మహరాజ్ అని శివసేన యూత్ అసోసియేషన్ ప్రతినిధులు కొనియాడారు. శివాజీ రాజ్యాభిషేక్ దినోత్సవం సందర్భంగా గురువారం జల్‌ల్లి శ్రీరాం కాలనీలో ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివాజీ తన జీవిత కాలంలో మొఘల్ సామ్రాజ్యం, గోల్కొండ సుల్తానేట్, బీజాపూర్ సుల్తానేట్, యూరోపియన్ వలస శక్తులతో పోరాడారన్నారు. సామ్రాజ్యం తరపున ఎన్నో సైనిక దండయాత్రలను ఎదుర్కొన్నారన్నారు. పురాతన హిందూ రాజకీయ సంప్రదాయాలు, కోర్టు సమావేశాలను పునరుద్ధరించిన ఘనత అతనికే దక్కుతుందన్నారు. నేటి తరం శివాజీ మహారాజ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లక్ష్మీనారాయణ, అసోసియేషన్ సభ్యులు శాంత కుమార్, షేర్ సింగ్, అంబదాస్, నర్సింగ్ బిరాదర్, రాహుల్ బిరాదర్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో 'బడిబాట' ప్రారంభం

- బడీడు పిల్లలను బడిలో చేర్పించండి
- ఉపాధ్యాయులు, అధికారులు, విద్యార్థుల ర్యాలీలు



మంచాల: బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: ప్రొ.జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని రాయపోల్ గ్రామంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ క్రాంతికిరణ్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ గురువారం ప్రారంభించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణం నుంచి గ్రామస్తులు, అధికారులు, విద్యార్థులు గ్రామంలో ర్యాలీని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించినట్లయితే ఉచితంగా పాఠ్య, నోట్ పుస్తకాలను అందించడమేగాక నాణ్యమైన విద్యాబోధన అందుతుందని తెలిపారు. 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు లావణ్య, అంగన్‌వాడీ టీచర్స్ సరస్వతి, భారతమ్మలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంచాల మండలంలో..

మంచాల: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈఓ వెంకట్‌రెడ్డి, ఆయా గ్రామాల్లోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదిబట్లలో..

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల ప్రభుత్వ ప్రాథమిక, జెడ్పీహెచ్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు డాక్టర్ పరమేష్ గురువారం ప్రారంభించారు. గ్రామంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బుచ్చయ్య, అశోక్, రామ్మోహన్, జంగయ్య, విజయలక్ష్మి, బబ్లీ, ఇందిరాదేవి, పాఠశాల చైర్మన్ మమత, వీఓలు మాధూరి, అంగన్‌వాడీ టీచర్ బేబీ, సుజాత తదితరులు పాల్గొన్నారు.



మంచాల: ఆరుట్లలో ఉపాధ్యాయులు తదితరులు



ఇబ్రహీంపట్నం: రాయపోల్‌లో ర్యాలీ



ఇబ్రహీంపట్నం: ర్యాలీని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ క్రాంతికిరణ్



ఇబ్రహీంపట్నం రూరల్: ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు